మోపెడ్ రేస్ అను జి.వి.యస్-50 కథ



ప్రతి ఆదివారం ఏదో గొడవమీద మాకెవరికీ విశ్రాంతి లేకుండా కాలనీ మీటింగ్స్‌లోకి ఈడ్వటం శాయిరామ్‌కి చాలా మామూలు విషయమని మీకూ తెలుసు కదా!

కానీ తమాషా ఏమిటంటే ఆ ఆదివారం ఆలాంటి గొడవ లేమీ లేకుండా రోజంతా ప్రశాంతంగా గడిచిపోయింది. కానీ మర్నాడు ఉదయం తెల్లారక ముందే తలుపుకొట్టేరెవరో. లేచివెళ్ళి నిద్రకళ్ళతో తలుపు తెరిచాను.

“గురూ! ఇవాళ మనకి జి.వి.యస్-50 మోపెడ్ వస్తోంది. అంచేత ఆఫీస్‌కి శెలవు పెట్టు-” అన్నాడు ఆనందంగా.

నాకు శాయిరామ్ మీద ఈర్ష్య కలిగింది. మా కాలనీలో మా బాచ్ వాళ్ళెవ్వరికీ మోపెడ్ లేదు. గవర్నమెంట్ ఉద్యోగుల జీవితాల్లో మోపెడ్ కాదుకదా- దాన్ని ఫ్రీగా ఇచ్చినా పెట్రోల్ పోయించే కెపాసిటీ ఉండదు.

“త్వరగా రడీ అవ్! నేను వెళ్ళి రంగారెడ్డికీ, జనార్ధన్‌కీ యాదగిరికీ గోపాల్రావుకీ కూడా చెప్పేసి వస్తాను” అంటూ వెళ్ళిపోయాడతను.

అందరం కలిసి పదింటికల్లా జి.వి.యస్-50 షోరూమ్ కెళ్ళాం.

“ ఏ కలర్‌కావాలో చూసుకోండి!” అన్నాడు మేనేజరు.

"బ్లూరంగు కొందాం!" అన్నాడు యాదగిరి. కాసేపు రంగుల గురించి మాలో మాకు వాగ్వివాదాలు జరిగాక చివరకు నల్లరంగు అయితే పది కాలాలపాటు బావుంటుందని సెలెక్ట్ చేసుకున్నాం. ఆ మోపెడ్ గురించి మేనేజర్ పావుగంట పొగిడాడు.

"లీటరు పెట్రోల్‌కి 70 కి.మీ.! అంటే ఎంత? కిలోమీటరుకి ఇరవై పైషలు ఖర్చు! అదే సిటీసబ్‌కయితే కి.మీ. 50 పైసలు!" షాప్ సూపర్‌వైజర్ వచ్చాడు "ఫస్ట్ రెండు సర్వీసింగ్‌లూ ఫ్రీ! ఆ తరువాత ఏ రిపేరు వచ్చినా మేమే మా స్పెషల్ మెకానిక్స్‌తో చేయిందినామినల్‌గా ఛార్జ్ చేస్తాం! కస్టమర్స్ సర్వీస్ ఈజవర్‌మోటో..." అన్నాడతను ప్రేమగా.

అందరం కలిసి బండి నడిపించుకెళ్ళి ఆ పక్కనే ఉన్న పెట్రోల్ బంకులో పెట్రోల్ పోయించాం.

అందరికీ ఆ పక్కనే ఉన్న హొటల్లో స్వీట్లు ఇప్పించాడు శాయిరామ్.

"మీరు కూడా కొనెయ్యండ్రా! ఎన్ని రోజులిలా మన దరిద్రపు సిటీ బస్సులో పుట్‌బోర్డు మీద వేలాడుతూ ప్రయాణం చేస్తారు!" అన్నాడు శాయిరామ్ మా అందరివంకా జాలిగా చూస్తూ. వాడంత జాలిపడుతుంటే నిజంగానే మా బ్రతుకు చూసి మాకు ఏడుపొచ్చింది. అందరం బయటికొచ్చాము.

"మీరు బస్‌లో ఇంటికొచ్చేయండి. నేను డ్రైవ్ చేసుకొచ్చేస్తాను-" అన్నాడు శాయిరామ్.

అప్పుడే బస్ వేలాడుతున్న జనంతో కదల్లేక కదులుతూ వచ్చింది.

"అబ్బబ్బ! నిజంగా బస్ ప్రయాణం హారిబుల్- రోడ్డుమీద చెత్తను వేసుకెళ్ళే మునిసిపల్ ఎద్దుబండిలో ప్రయాణం చేసినట్లే...." అన్నాడు శాయిరామ్ మా మీద ఇంకా జాలిపడుతూ-.

మేమందరం మొఖాలు చూసుకుని మళ్ళీ మా మీద మేమే జాలిపడ్డాం.

వాడు బండి స్టార్ట్ చేసికొని జనంలో నుంచి తూనీగలా దూసుకుపోయాడు.

మేము దిగులుగా బస్‌కోసం ఎదురుచూస్తూ నిలబడ్డాం.

"ఈపాటికి మన కాలనీ చేరుకుని ఉంటాడు..." అన్నాడు రంగారెడ్డి దిగులుగా తన వాచ్ వంక చూస్తూ.

"అవ్!" అన్నాడు యాదగిరి ఇంకా దిగులుగా- ఆగకుండా వెళ్ళిపోయినా ఓ బస్సువంక చూస్తూ.

చివరకు అరగంట తర్వాత కాలనీ బస్ దొరికింది.

తీరా ఎక్కి రెండు స్టాప్‌లు దాటామో లేదో- అక్కడ రోడ్డు పక్కనే ట్రాఫిక్ పోలీస్‌తో ఏదో గొడవపడుతున్న శాయిరామ్ కనిపించాడందరికీ.

"ఏదో గొడవయినట్లుంది- పదండి! దిగి వెళ్దాం" అన్నాడు జనార్ధన్. అందరం బస్ దిగి వెళ్ళాం.

"బండి కొన్నది ఇప్పుడే అయితే లైసెన్స్ ఎక్కడి నుంచి వస్తుందడీ!" అంటూ అరచాడు శాయిరామ్ గట్టిగా.

"ముందే టెంపరరీ లైసెన్స్ తీసుకోవాలయ్యా!" అన్నాడు కానిస్టేబుల్.

"టెంపరరీ లైసెన్స్ గురించే పోతున్నాడండీ! ఇంతలోనే మీరు రుకాయించబట్టి–" అంటూ కల్పించుకున్నాడు రంగారెడ్డి.

"నువ్వెవరు?" కోపంగా రంగారెడ్డిని అడిగాడు కానిస్టేబుల్.

"అతని దోస్తుని"

''దోస్తానా ఉంటే ఇంటి దగ్గర– ఈడగాడు'' ఆ మాటతో రంగారెడ్డి సైలెంటయిపోయాడు.

"అదంతా మాకనవసరమయ్యా! రెండొందలు ఫైన్ కట్టాలె" శాయిరామ్‌తో అన్నాడు ఇంకో కానిస్టేబుల్.

అందరం ఉలిక్కిపడ్డాం! అయిదూ పదీకాదు! రెండొందలు–

"ఇదిగో – బండికి 'ఎల్' బోర్డు కూడా పెట్టలే" అన్నాడు కానిస్టేబుల్– ఇప్పుడు బండిలోని మొత్తం లోపాలన్నీ పరీక్షిస్తూ.

"ఇదిగో– హెడ్‌లైట్‌కి సగం నల్లరంగు వేయాల్సున్నది– వేయలే!"

రాన్రాను లిస్ట్ పెరిగపోతుందని భయపడి యాదగిరి అతనిని పక్కకు తీసుకెళ్ళి రహస్యంగా మాట్లాడివచ్చాడు.

ఆ కేసులన్నీ వదిలించుకోవడానికి వంద రూపాయలు ఖర్చయింది!

ఆ తరువాత రెండురోజుల మోపెడ్ మీద ఆఫీస్‌కెళ్ళాడో లేదు మళ్ళీ వారం శెలవుపెట్టాడు.

"ఏమిటి? ఏమయింది?" ఆశ్చర్యంగా అడిగాను శాయిరామ్‌ని కలుసుకుని.

"షాపువాళ్ళు ఇచ్చింది టెంపరరీ రిజిస్ట్రేషన్ కదా! అందుకని రోడ్ టాక్స్ కట్టడానికి రోజూ ఆ ఆఫీసుకెడుతున్నాను–" అన్నాడు దీనంగా చివరకు తనకు సాధ్యంకాక బ్రోకర్‌కు వెయ్యిరూపాయలిచ్చి పని పూర్తిచేశాడు.

వారం రోజుల తరువాత రోడ్‌టాక్స్ బుక్ తీసుకొని విజయగర్వంతో మళ్ళీ మోపెడ్ మీద ఆఫీస్‌కొచ్చాడు.

ఆ తరువాత ఆదివారం అమ్ముగూడాలో బోసువాళ్ళింటికెళ్ళి వస్తానన్జెప్పి మోపెడ్ మీద కాలనీలో హారన్ కొట్టుకుంటూ వెళ్ళాడు. మోపెడ్ పుణ్యమా అని కాలనీలో మీటింగ్‌ల బెడద తప్పిందిగ దాని సంతోషించాం మేము! కానీ ఆ సంతోషనం ఎంతోసేపు నిలువలేదు.

"మీరు కూడా జి.వి.యస్-50 కొనండి!" అంటూ మా కాలనీలో ఆడాళ్ళందరూ భర్తలను వేధించుకు తినడం మొదలుపెట్టారు. రంగారెడ్డి ఇక తప్పేదిలేదని జి.వి.యస్-50 కోసం రెండువేలు డిపాజిట్ కూడా కట్టేశాడు.

ఈ విపత్కర పరిస్థితి నుంచి ఎలా తప్పించుకోవాలా అని నేను ఆలోచిస్తూండగా అసలు కథ ప్రారంభమయింది. మేము లకడీకపూల్ దగ్గర ఒక బస్ కోసం చూస్తూంటే తన మోపెడ్‌ని సైకిలు రిక్షాలో వేసుకుని చెమటలు కారిపోతూ వెనుక నడుస్తూ కనిపించాడు శాయీరామ్.

అందరం పరుగుతో వెళ్ళి రిక్షాచుట్టూ మూగాము.

"ఏమిటి? ఏం జరిగింది?" అనడిగాడు రంగారెడ్డి ఆశ్చర్యంగా.

"ఎందుకో వీల్ తిరగటం లేదు-" అన్నాడు శాయీరామ్ కర్చీఫ్‌తో చెయమటలు తుడుచుకుంటూ.

"అప్పుడే ఈ ట్రబులేమిటి! పద- షోరూమ్‌కెళ్ళి ఆ మేనేజర్ని అడుగుదాం" అన్నాన్నేను.

అందరం ఆఫీస్ ఎగ్గొట్టి షోరూం కెళ్ళాం.

అప్పుడే మరో అరడజను మంది కూడా తమ తమ మోపెడ్‌లను రిక్షాల్లో వేసుకొచ్చారు.

మెకానిక్ మా మోపెడ్‌ని కాసేపు రిపేర్ చేసి "వీల్' తిరిగేట్లు చేశాడు.

"క్లచ్‌ప్లేట్స్ కూడా పోయాయ్ కౌంటర్‌లో కొనుక్కురండి" అన్నాడు బండి స్టార్టవకపోయేసరికి.

జనార్ధన్ కోపం పొడుచుకొచ్చింది.

"అదేమిటి? కొత్తబండే కదా; ఫ్రీగా వేయరా" అనడిగాడు చొక్క చేతులు పైకి మడుస్తూ.

"అలా మాట్లాడకు గురూ! కిరికిరి ఎందుకూ?" అన్నాన్నేను అతని చొక్కాచేతులు క్రిందకు దించేస్తూ.

అందరం మేనేజర్ దగ్గరకు నడిచాం.

మేనేజర్ చిరునవ్వు నవ్వాడు "ఈ క్లచ్‌ప్లేట్స్ మీరు నిర్లక్ష్యంగా బండినడపడం వల్ల పోయాయ్- అంచేత కొనుక్కుని వేసుకోవాల్సిందే" అన్నాడు.

మేనేజరు సాబ్! ఇది మంచిగలేదు, మేము బండి మంచిగ నడపలేదని నీకేం యెరుగ?" అన్నాడు యాదగిరి కోపం అణచుకుంటూ.

"రామచంద్రన్" షాపు సూపరైజర్‌ని పిలిచాడు మేనేజర్.

"యస్సార్!"

"వీళ్ళ బండి బయట పెట్టెయ్యండి! ఆర్గ్యుమెంట్‌కి టైమ్‌లేదు" అని మేనేజర్ మోపెడ్ డెలివరీ కోసం వచ్చిన మరో కస్టమర్‌తో మాట్లాడడం మొదలుపెట్టాడు. చేసేదిలేక కౌంటర్ దగ్గరకెళ్ళి "క్లచ్‌ప్లేట్స్" కోసం అడిగాము.

"అదిప్పుడు స్టాక్‌లేదు! ఓవారం తరువాత కనుక్కోండి!" అన్నాడు సేల్స్‌మన్.

మాకు వళ్ళు మండిపోయింది.

"అంతవరకూ ఏం చేయాలి?" అడిగాడు రంగారెడ్డి.

"ఎదురుచూడాల్సార్!"

అందరం చేసేదిలేక బయటికొచ్చాము. హఠాత్తుగా యాదగిరికో అయిడియా వచ్చింది.

"అరెభయ్- ఈ పార్టు బయట షాపులోభీ ఉంటయ్ గద! పొయ్యి అరుసు కుందాం నడవండ్రి!" అందరం స్పేర్‌పార్ట్స్ షాపుకెళాం.

"క్యాహెూనా?" అన్నాడు సర్దార్జీ.

"జి.వి.యస్.-50 క్లచ్‌ప్లేట్స్-"

అతను వెంటనే క్లచ్‌ప్లేట్స్ పాకెట్ తీసిచ్చాడు మాకు ఆశ్చర్యం కలిగింది. ఆ కంపెనీ పార్ట్స్ మోపెడ్ కంపెనీ వాళ్ళ షోరూమ్‌లో తప్పుతే మిగతా అన్ని చోట్లాలభిస్తాయన్న మాట!

"ఎంత?" అడిగాడు శాయిరామ్ భయంగా.

"దేడ్ సౌ రూపయా-" శాయిరామ్ హారర్ ఫిలిమ్ చూసినట్లు చూశాడు సర్దార్జీవంక.

"అదేమిటి? షోరూమ్‌లో వందరూపాయలేగా!"

"అయితే అక్కడే తీస్కో-" అన్నాడు సర్దార్జీ అచ్చతెలుగులో. అందరం షాపు బయటి కొచ్చేస్తుంటే సర్దార్జీ పిలిచాడు.

"ఏయ్... ఇధరావో"

అందరం వెనక్కు నడిచాం మళ్ళీ.

"డూప్లికేట్ క్లచ్‌ప్లేట్ సెట్ చెలేగా క్యా? మంచిగుంటది!"

"ఎంత?"

"పచాస్! యాభై"

రంగారెడ్డి అనుమానంగా శాయిరామ్ వేపు చూశాడు. శాయిరామ్ ఆ పక్కనే ఉన్న దేవుడి కేలండర్‌వేపు చూశాడు.

"సరే- తీసుకో- కనీసం ఈ పదిరోజులూ ఉండి పనిచేస్తే చాలుగదా-" అన్నాడు జనార్ధన్.

ఆ డూప్లికేట్ సెట్ కొని మెకానిక్ దగ్గరకెళ్ళాం.

అరగంటలో అది ఫిట్‌చేసి ఇచ్చాడతను.

"నలభైరూపాయలివ్వండి!" అన్నాడు చిరునవ్వుతో చేయి చాపుతూ.

"అదేమిటి? ఈ కాస్త పనికి నలభైరూపాయలా?"

"డూప్లికేట్ పార్ట్ అని తక్కువ అడిగినా సార్! లేకుంటే అరవై-"

నలభయ్ వాడి చేతిలో పెట్టి అందరం కదిలాం అక్కడ నుంచి.

"మీరు బస్‌లో వెళ్ళండ్రా! పాపం మీకు వెధవ బస్‌లు ఎప్పటికి దొరుకుతాయో ఏమో! నేను బండిమీద వచ్చేస్తాను-" అన్నాడు శాయిరామ్.

"నేనూ నీ బండిమీద వచ్చేస్తాను-" అన్నాడు రంగారెడ్డి ముచ్చటపడిపోతూ. అతని వెనుక కూర్చోగానే శాయిరామ్ స్టార్ట్ చేశాడు.

మేమంతా బస్‌కోసం ఎదుర్చూసి చూసి గంటన్నర తరువాత ఇంటికి చేరుకునేసరికి సాయంత్రం అయిపోయింది. అప్పటికీ వాళ్ళిద్దరూ కాలనీకి చేరుకోలేదు.

"ఏమయ్యారంటావ్?" అడిగాడు జనార్ధన్.

"అదే సమజ్ కావటంలేదు- ఏడయినా టక్కరిచ్చిన్రేమో-" అన్నాడు యాదగిరి అనుమానంగా. మేమంతా ఆ విషయం పెద్ద ఎత్తున డిస్కస్ చేస్తుండగానే శాయిరామ్ భార్య రంగారెడ్డి భార్యా ఏడుస్తూ పిల్లల్ని తీసుకొచ్చేశారక్కడికి.

"చెప్పండి అన్నయ్యగారూ! ఆయనెలా ఉన్నారు! దెబ్బలు బాగా తగిలాయా?" అంటూ అడిగేసరికి మాకు మతిపోయినట్లయింది.

"ఏమిటి? ఏం జరిగింది?" అనడిగాను ఆశ్చర్యంగా.

"అదే- ఆయన మోపెడ్‌కి యాక్సిడెంట్ అయిందని మీరు మాట్లాడుకుంటూంటే పిల్లలు విని చెప్పారు..." మాకు నవ్వాలో ఏడవాలో తెలీలేదు.

యాదగిరి జరిగిందంతా నచ్చజెప్తోంటే- దూరంగా రంగారెడ్డి, శాయిరామ్ మోపెడ్‌ని తోసుకురావడం కనిపించింది. పిల్లలంతా పరుగుతో వెళ్ళి దాని చుట్టూ మూగారు.

"అంకుల్, దానిమీద ఎక్కించుకుని ఓ రౌండ్ తిప్పవూ?" అడగసాగారందరూ.

"ష్! పోండ్రా! మేము ఓ రౌండ్ తిరుగుదామంటేనే కుదిరిచావడటం లేదు. వెళ్ళండి- వెళ్ళండి-" విసుక్కున్నాడు రంగారెడ్డి.

"ఏం జరిగింది మళ్ళీ-" అడిగాము ఆత్రుతగా.

"ఓ ఫర్లాంగు నడిచి ఆగిపోయింది."

"ఎందుకని?"

"క్లచ్‌ప్లేట్స్ పోయాయట-"

"అదేమిటి ఇప్పుడేగా కొత్తది వేయించిందీ?"

"డూప్లికేట్ పార్ట్స్ అంతేనంట! మెకానిక్ చెప్పాడు" అన్నాడు శాయిరామ్ దిగులుగా.

"పోనీ అసర్దార్జీ దగ్గర ఒరిజినల్ పార్ట్ కొనేయడం మంచిదేమో"

"అవును-"

అందరం కలిసి ఇలా కష్టమర్లను ఇన్ని తిప్పలు పెడుతూన్న జి.వి.యస్-50 కంపెనీని తిట్టుకున్నాం.

ఆ మర్నాడు అందరి దగ్గరా తలో ఇరవై రూపాయలూ అప్పు తీసుకుని ఒరిజినల్ క్లచ్‌ప్లేట్స్ కొనడానికి బయల్దేరాడు శాయిరామ్.

"నేను అది కొని మెకానిక్‌తో ఫిట్ చేయించే వరకూ బండి తోసుకుంటూ నడిచే తిరగాలి- మీరు హాయిగా ఇంటి దగ్గర బస్సెక్కి ఆఫీస్‌లో దిగుతారు." అన్నాడు మా వంక ఈర్ష్యగా చూస్తూ.

"ఆ- మాకు మాత్రం సుఖం ఏముందిలే! నీ బండి కంటె కొంచెం తక్కువ శ్రమ! అంతేకదా-" అన్నాడు రంగారెడ్డి.

తీరా మేము ఆఫీస్ చేరుకుని గంటన్నర అయినా శాయిరామ్ జాడకనిపించలేదు. సాయంత్రం కాలనీ చేరుకునే సరికి అతనింటి ముందు మోపెడ్ కనిపించింది.

అందరం లోపలికెళ్ళాం.

"ఏమయింది? ఆఫీస్‌కి రాలేదు!" అడిగాం శాయిరామ్‌ని.

"క్లచ్‌ప్లేట్ వేయించి ఆఫీస్ కొస్తుంటే- క్లచ్‌వైర్ తెగిపోయింది. మళ్ళీ క్లచ్ వైర్ కొనుక్కుని వేయించేసరికి పన్నెండయిపోయింది- అప్పుడింక ఆఫీస్‌కెలా రావటం? అందుకని ఇంటికొచ్చేశాను-" అన్నాడు దిగులుగా.

"పోనీలే- ఇంక రేపట్నుంచీ ప్రాబ్లెమ్స్ ఏమీ ఉండవు కదా-"

"ఏమీ ఉండవు!" అన్నాడతను ఉత్సాహంగా.

మర్నాడు పొద్దున్న ఎనిమిదింటి నుంచీ శాయిరామ్ మోపెడ్‌ని స్టార్ట్ చేయడానికి ప్రయత్నించడం మా కందరికీ తెలుస్తూనే ఉంది. తొమ్మిదయినా అది ఇంకా స్టార్టవలేదు. మేము ఆఫీస్ కెళ్ళడానికని బయటికొచ్చేసరికి శాయిరామ్ చెమట్లుకక్కుకుంటూ పెడల్ కొడుతూనే ఉన్నాడు గానీ అది స్టార్ట్ కావటం లేదు. బోలెడుమంది పిల్లలు చుట్టూ మూగి ఉన్నారు. కొంతమంది పెద్దలు కిక్ ఎట్లాకొట్టాలో సలహాలిస్తున్నారు శాయిరామ్‌కి.

శాయిరామ్ భార్య ఉండుండి టవల్‌తో అతని చెమటలు తుడుస్తోంది.

మేము అక్కడికి చేరుకున్నాం.

"మళ్ళీ ఏం జరిగింది?" అడిగాడు జనార్ధన్.

"స్టార్ట్ కావటం లేదెందుకో!"

"మెకానిక్‌కి చూపించు! ఇలా రోజుల తరబడి "కిక్" కొడితే ఏం లాభం?" అన్నాడు రంగారెడ్డి.

"ఓ వేళ ప్లగ్ గిట్ల క్లీన్ చెయ్యాల్నేమో–" అన్నాడు యాదగిరి.

"ఇందాకే క్లీన్ చేశాను–"

"చలో– అందరం కలసివెళ్ళి ఈ షోరూమ్ మేనేజర్ని పట్టుకుందా! కొత్త బండికే ఇన్ని ట్రబుల్స్ వస్తే ఎలా?" అన్నాడు జనార్ధన్.

అందరం బండిని ఆటోలో వేసుకుని షోరూమ్ చేరుకున్నాం.

"ఏమయింది?" అడిగాడు షాప్ సూపర్‌వైజర్.

"మాకేం తెలుసు? స్టార్టవటం లేదు–" అన్నాడు శాయిరామ్.

"ఒరేకిషన్–" మెకానిక్‌ని పిలాచాడతను.

"ఓ పన్నెండేళ్ళ కుర్రాడు బయటకొచ్చాడు.

"బండి చూడోసారి!" అన్నాడతను.

కుర్రాడు పరీక్ష చేశాడు "కార్బొరేటర్ క్లీన్ చేయాల్సార్!" అన్నాడు సూపర్‌వైజర్‌తో.

"మరి చేసేయ్–" అన్నాడు రంగారెడ్డి.

"ఇప్పుడెక్కడ కుదురుతుంది సార్! ఎల్లుండి సాయంత్రానికిగానీ కుదరదు. ఎల్లుండి పొద్దున్న తెచ్చివ్వండి బండి–"

"అదేమిటి? మేము బండి కొంటున్నప్పుడు "కస్టమర్స్ సర్వీస్ ఈజ్ అవర్ మోటో" అన్నావుగా!"

"అవును! ఇప్పుడు మాత్రం లేదని ఎవరన్నారు?"

"అయితే ఇప్పుడే రిపేర్ చేయించాలి కదా–"

"కుదరదు! బోలెడు మోపెడ్స్‌కు ఎడ్వాన్స్‌గా చెప్పి ఉంటాము. అంచేత అవన్నీ రిపేర్ చేయటం పూర్తయాకే మీ బండి–"

"ఇగో మాదీ బండి గిప్పుడు రిపేర్ చేస్తావా? చేయవా? ఒక్కమాట చెప్పు" అన్నాడు ఆజమ్‌భాయ్ అతని మీద కెళ్తూ.

"ఏం బెదిరిస్తున్నావా!" అన్నాడు సూపర్‌వైజార్ కూడా ముందుకొస్తూ.

ఈలోగా యాదగిరి అతని చొక్కా పట్టుకున్నాడు. అతను యాదగిరి చొక్కా పట్టుకున్నాడు.

మేనేజర్ పరుగుతోవచ్చి ఇద్దరినీ వెనక్కు లాగేశాడు.

"అలా కొట్టుకోవటం ఎందుకయ్యా! అందరం స్నేహంగా ప్రేమగా మాట్లాడుకోవాలి!" యాదగిరి చట్టుక్కున మేనేజర్ చొక్కా పట్టుకున్నాడు. అందరం కలిసి వాళ్ళిద్దరినీ విడిపించాం.

చివరకు చేసేదేమీలేక మళ్ళీ దానిని తోసుకుంటూ మెకానిక్ దగ్గరకెళ్ళాం. రెండు గంటల తరువాత బండి రిపేరయింది. పదిరూపాయలు మళ్ళీ సమర్పించుకుని ఇంటి మొఖం పట్టాము.

"ఒరేయ్-నేను బండిమీద ముందు వెళ్తూంటాను. మీరు ఆటోలో నా వెనుకే వస్తూండండి" అన్నాడువాడు భయంగా. వాడు కోరినట్లే ముందు వాడి మోపెడ్ వెనుక మేము రెండు ఆటోల్లో బయల్దేరి ఇల్లు చేరుకున్నాం

మర్నాడు ఆఫీసులో ఆ మధ్య జి.వి.యస్-50 కొన్న శేఖర్‌ని కలుసుకున్నాం.

"ఏం గురూ? ఎలా వుంది నీ బండి!" అనడిగాం చాలా ఫార్మల్‌గా అడుగుతున్నట్లు.

"ఫర్లేదు బావుంది!" అన్నాడతను.

అందరం మొఖమొఖాలూ చూచుకున్నాం.

"రిపేర్లేమీ లేవా?"

"చాలా తక్కువ! కొత్తబండి కదా! మహా అయితే నెలకి నాలుగొందలు రిపేర్ కవుతుంది! అంతే! రాత్రాను బాగా ట్రుబలిస్తుందంటున్నారు గానీ ఇప్పుడు బాగుంది! నాలుగొందలే ఖర్చవుతోంది."

"అయినాగాని అంత ఖర్చవుతూంటే నీకు జీతం ఎలా సరిపోతోంది" ఆశ్చర్యంగా అడిగాను.

"ఏడ్చినట్లుంది! నా జీతం ఎందుకు ఖర్చుచేస్తాను దీనికి! ఇది మా మావగారు కొనిచ్చారు. అంచేత ఖర్చంతా ఆయనిదే! ఆయనదగ్గర చాలా బ్లాక్‌మనీ ఉందికదా! బ్లాక్‌మనీ వైట్ చేసుకోవాలనుకొనే వాళ్ళంతా జి.వి.యస్-50యే కొంటారట! ఒక్క సంవత్సరంలో నలభై లక్షలవరకూ బ్లాక్ మనీ వైట్ అయిపోతుందట-" చెప్పాడు వాడు. ఆ సాయంత్రం మళ్ళీ ఎంత తన్నుకున్నా బండి స్టార్టవలేదు.

అందరం బండిని మెకానిక్ దగ్గరకు తీసుకెళ్ళాము-

"ప్లగ్ ఖరాబయింది సార్! కొత్తది తీసుకురాండ్రి!" అన్నాడు మెకానిక్.

"ఎంతవుతుంది?" ఏడుపుమొఖంతో అడిగాడు శాయీరామ్.

"కొత్త ప్లగ్ వందరూపాయలుంటుంది సార్"

"ప్లగ్ కెంతయినా ఫర్లేదు. నేనడిగేది నీ ఛార్జీ ఎంతవుతుందని?"

"ఎంత సార్ పాతిక రూపాయలు."

అక్కడి నుంచి ఇద్దరం రిక్షాలో ఆటో స్పేర్ పార్ట్సు అమ్మేషాపుకెళ్ళి ప్లగ్ కొనుక్కొచ్చి వేయించాము. బండి బ్రహ్మాండంగా స్టార్టయింది. అందరం హాయిగా ఇంటికి చేరుకున్నాం.

శాయీరామ్ ఆ తర్వాత కాసేపు కాలనీ పిల్లల్ని వెనుక ఎక్కించుకుని రౌండ్స్ కొట్టాడు.

ఆ తరువాత మేమందరం చూస్తూండగానే వాళ్ళావిడను దర్జాగా ఎక్కించుకుని సినిమా కెళ్ళిపోయాడు. రాత్రి తొమ్మిదిన్నరవరకు నేను నవల చదువుకోవటం ఆపి పడుకుందామనుకుంటే ఆటో వచ్చి శాయీరామ్ ఇంటి ముందాగింది అందులో నుంచి శాయీరామ్ ఫామిలితో దిగాడు. లేచి అతని దగ్గర కెళ్ళాను.

"ఆటోలో వచ్చావేమిటి?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఆ వెధవబండి స్టార్టయి ఛస్తేగా?" మండిపోతూ అన్నాడతను.

"ఎందుకని?"

"మధ్యలో గంటసేపు వర్షం కొట్టింది కదా! వర్షంలో తడుస్తే- కార్బొరేటర్‌లోకి నీళ్ళు వెళ్ళి బండి స్టార్టు కాదంట- అందుకనే దాన్ని సినిమా హాల్లోనే వదిలేసి ఆటోలో వచ్చేశాము"

మర్నాడు ఆఫీసుకి శెలవుపెట్టి బండి రిపేర్ కోసం వెళ్ళాడతను. సాయంత్రం మేము ఇంటికొచ్చేసరికి మోపెడ్ మళ్ళీ తళ తళ మెరుస్తూ శాయీరామ్ ఇంటిముందు కనిపించింది. "శాయీరామ్ బండి బాగుపడిందా?" అడిగాడు రంగారెడ్డి ఆత్రుతగా.

"ఎందుకు?"

"అలా కోఠి వరకూ వెళ్ళివద్దామని- నా క్కొంచెం పని ఉంది-"

"కోఠి వరకా!"

"అవును! ఏం?"

"అదెక్కడ పనిచేస్తుంది? ఇంటి కొస్తుంటే- యాక్సిలేటర్ వైర్ పోయింది-"

"అదేమిట్రా! నీ బండికిలా ట్రబుల్స్ వస్తున్నాయ్? మరి వామన్రావ్‌గాడు హాయిగా నడుపుతున్నట్లు చెప్పాడు కదా!"

"ఏమో అదే నాకు అర్థం కావటం లేదు- ఇప్పటికిప్పుడే వెయ్యిరూపాయలు మెకానిక్‌కీ రిపేర్లకూ ఖర్చయింది...." అన్నాడు దిగులుగా.

"వామన్రావ్‌గాడింటికెళ్ళి కనుక్కొద్దాం పద-" అన్నాడు రంగారెడ్డి.

అందరం కలసి వామన్రావ్ ఇంటికి బస్సులో చేరుకున్నాం. అంతా వినివాడు చిరునవ్వు నవ్వాడు.

ఈ మోపెడ్ కొన్నప్పుడు మనం టైం టేబుల్ వేసుకోవాలి బ్రదర్! అలా వేసుకుని దాన్ని ఫాలో అయితే ట్రబులుండదు-"

"ఏమిటా టైమ్ టేబుల్?"

"ప్రతి సోమవారం క్లచ్‌ప్లేట్స్ కొత్తవి వేయించాలి! మంగళశారం కొత్తప్లగ్, బుధవారం కొత్త క్లచ్‌వైరూ, గురువారం యాక్సిలేటర్ వైరూ, శుక్రవారం కార్బొరేటర్ క్లీన్ చేయించాలి,

శనివారం ఓవరాలింగ్, ఆదివారం బండికి రెస్టు– అంతే! చెక్కు చెదురదు బండి! ఎప్పుడూ మాంచి కండిషన్‌లో ఉంటుంది–"

మరి ఇవ్వన్నీ చేయిస్తూ కూర్చుంటే ఆఫీస్ కెలా వెళ్తాను?" ఆశ్చర్యంగా అడిగాడు శాయిరామ్.

"బస్‌లో!"

"మరింకా బండి ఎందుకు?"

"ఎమర్జెన్సీలో ఉపయోగించటానికి– అంటే రోజూ మెకానిక్ దగ్గరకు తీసుకెళ్ళడానికి, మళ్ళీ అక్కడి నుంచి ఇంటికి తేవడానికీ– స్పేర్ పార్ట్సు కోసం షాపు చుట్టూ తిరగడానికి అది పనిచేయ్యాలి కదా–" అందరం తిరిగి వచ్చేస్తూంటే లక్ష్మయ్య కొత్త జి.వి.యస్–50 మోపెడ్ మీద ఎదురయ్యాడు.

"ఏం గూరూజీ! ఇది కొన్నారా! గాబరాగా అడిగాడు రెడ్డి.

లక్ష్మయ్య చిరునవ్వు నవ్వాడు.

"పిచ్చివాళ్ళల్లారా! మనం ఏ బండీ ఎప్పుడూ కొనకూడదు?"

"మరి?"

"కొన్నవాళ్ళనడిగి రెండురోజుల కోసం వాళ్ళ బండి అరువు తెచ్చుకుని మళ్ళీ ఇచ్చివేస్తుండాలి–"

" ఆ తర్వాత ఎలా మరి?"

"ఇంకో ఓనర్‌ని వెతుక్కోవాలి–"

"అలా ఎంతకాలం?"

"జీవితమంతా అలా గడిపేయడమే? నాకు చూస్తూ చూస్తూ ఈ పద్ధతిలోనే పదేళ్ళు గడిపోయింది కదా!"

"కానీ అలా ఎందుకు? మీరే ఓ బండి కొనుక్కోవచ్చు కదా?"

"కొనుక్కుంటే మనమే రిపేర్లు చేయించ్చొద్దంటోయ్! అది పిచ్చిపని! తెలివితక్కువ వాళ్ళు చేసేపని– వస్తా ఈ బండి కొంచెం ట్రబులిస్తోంది! త్వరగా ఓనరుకిచ్చేయాలి– అన్నట్లు నీ బండి కండిషన్ బావుందా? ఉంటే నా కివ్వు! రెండ్రోజుల్లో ఇచ్చేస్తాను–"

మేము మాట్లాడకుండా ముందుకి నడిచాము.

"అరె మాట్లాడరేమయ్యా! ఓనర్లకు తెగ పొగరెక్కువయిపోయిందీ మధ్య! ఇస్తాను ఇవ్వను అని కూడా చెప్పటం లేదు–" అంటూ తన బండి స్టార్టు చేసుకెళ్ళిపోయాడు లక్ష్మయ్య కోపంగా. ఆ రాత్రి శాయిరామ్ ఇంట్లోనుంచి పెద్ద పోట్లాట వినిపించింది. మేమంతా అతనింటి కెళ్ళాం సంగతేమిటో కనుక్కుందామని.

"ఆ పాడుబండి కొనటమే నా కిష్టం లేదసలు. దానికోసం - గొలుసు బ్యాంక్‌లో పెట్టాలంటే పోనీలే కదాని ఇచ్చాను. ఇప్పుడు దాని రిపేర్లకి మంగళసూత్రం కావాలా! ఛస్తే ఇవ్వను-" అంటోంది వాళ్ళావిడ.

వాళ్ళ సంభాషణ విని మేమంతా బరువెక్కిన గుండెలతో వెనక్కు తిరిగి వచ్చాం! శాయిరామ్ కష్టాలు చూసి మా అందరికీ విపరీతమయిన జాలివేసింది. మర్నాడు ఉదయం శాయిరామ్‌కి జ్వరం వచ్చిందని తెలిసింది. అందరం వెళ్ళి కాసేపు అతనితో మాట్లాడి జ్వరానికి టాబ్‌లెట్స్ తెప్పించాం.

అయితే అది జ్వరం కాదనీ, కేవలం ఆ మోపెడ్‌ని ఏమి చెయ్యాలో తెలీక వచ్చిన మనోవ్యధ అని తేల్చిందతని భార్య

అందరం మళ్ళీ శాయిరామ్ దగ్గరకెళ్ళి ధైర్యం చెప్పాము.

"మోపెడ్ గురించి దిగులుపడుతున్నావా ఏమిటి?" అని అడిగాడు గోపాల్రావ్.

"ఏం ఫర్లేదు బ్రదర్! ఆ బండి విషయం మర్చిపో! దాని సంగతి మేము చూసుకుంటాం" అన్నాడు జనార్ధన్.

"ఇప్పుడు దాన్నింక ఎవరుమాత్రం ఏం చెయ్యగలం?" విచారంగా అన్నాడు శాయిరామ్. రంగారెడ్డి గలగలనవ్వాడు.

"పిచ్చివాడా! ఈ మాత్రానికే బెంబేలు పడిపోతే ఎలా? ప్రతి సమస్యకూ ఓ పరిష్కారం ఉంటుంది అని ఎక్కడో చదివాం కదా! అంచేత మోపెడ్‌లు కొన్నివారికి కూడా ఏదో బయటపడే మార్గం ఉండే ఉంటుంది-" అన్నాడు ఆప్యాయంగా.

"ఈ బండి గురించి సోంచాయించెడి దేమున్నదివయ్యా! మా చిన్నమ్మ కొడుకు గిట్టనే మోపెడ్ కొన్నంక పరేషాన్ పరేషాన్ అయి- రెండు నెలల్ల అమ్మేసిండు మళ్ళీ-" అన్నాడు యాదగిరి.

అందరూ యాదగిరి సలహాకు తప్పట్లు కొట్టారు.

"వండర్‌ఫుల్ అయిడియా! మన మోపెడ్‌ని కూడా అమ్మేస్తే- చాప్టర్ క్లోజ్! శాయిరామ్ ఇంట్లో మళ్ళీ సుఖశాంతులు" అన్నాడు జనార్ధన్.

శాయిరామ్ కూడా కొద్దిక్షణాలు ఆనందపడిపోయాడుగానీ వెంటనే అతనిమొఖంలో మళ్ళీ మబ్బులు కమ్ముకొచ్చేసినయ్.

"కానీ- ఫస్ట్ హాండ్‌కే నమ్మకం లేదు ఈ సెకండ్ హాండ్ నెవరు కొంటారు? మన కాలనీ చుట్టుపక్కల వాళ్ళందరికీ దీని విషయం తెలిసిపోయింది కదా!"

"దానికి ఓ ఉపాయం ఉంది బ్రదర్! మన గోపాల్రావ్ న్యూస్‌పేపర్లో ఎడ్వర్టయిజ్‌మెంట్ చేస్తే జనం విరగడిపోరూ?" అన్నాడు జనార్ధన్.

"ఒండర్‌ఫుల్ అయిడియా" అన్నాడు రంగారెడ్డి.

అప్పటికప్పుడే అందరం కూర్చుని ప్రకటన తయారు చేయటం మొదలుపెట్టాము.

"నెలరోజులు మాత్రమే ఉపయోగించిన అద్భుతమైన మోపెడ్ అమ్మకానికి కలదు" అన్నాడు జనార్ధన్. "అలా పొడిగా రాస్తే చాలదోయ్! మన బండిని బాగా పొగిడి ఎట్రాక్షన్ కలుగజేయాలి–" అన్నాడు రంగారెడ్డి ఆలోచిస్తూ. కొద్దిక్షణాల తర్వాత గట్టిగా అరచాడు.

"ఆ! దొరికింది! చూడండి చెప్తాను.

ఇక్కనెల మాత్రమే– ఒక్క ఓనర్‌వాడిన – సరికొత్త మోపెడ్ (జి.వి.ఎస్–50) అమ్మకానికి సిద్ధంగా ఉంది. అద్భుతమైన పికప్! లీటర్ పెట్రోల్‌కి డెబ్భై కిలోమీటర్లదూరం (త్వరలో ఎనభైకూడా ఇస్తుందని కంపెనీ వారి గ్యారంటీ) కావల్సినవారు వెంటనే శాయీరామ్, (నిర్భయ్‌నగర్‌కాలనీ)ని కలుసుకోండి! ఇది సువర్ణావకాశం! ఆలసిస్తే ఆశాభంగం! నేడే మీ అభిమాన మోపెడ్‌ని సందర్శించి సొంతం చేసుకోండి!

యూసుఫుద్దీన్ నిసార్ కది అంతగా నచ్చలేదు.

"యే బస్ నహీహెూతా యార్!" అన్నాడు తనూ ఆలోచిస్తూ.

"ఎందుకు? ఏం తక్కువయింది?" అడిగాడు జనార్ధన్.

"అది మంచి మోపెడ్ ఉంటే ఈ శాయీరామ్ ఎందుకు అమ్ముతుయ్? కొంచెం బ్రెయిన్ ఉంటే ఎవ్వరూ కొనయ్?" అన్నాడువాడు.

"నీ తెలుగు తగలెయ్యా!" అన్నాడు గోపాల్రావ్.

నిసార్ నవ్వాడు "ఈ తెలుగుసాలు భాయ్ ఆంధ్రప్రదేశ్‌కో!"

నిసార్ చెప్పిన పాయింట్ మా కందరికీ అర్ధమయింది. నిజమే ఆ మోపెడ్ అంత అద్భుతమయినదయితే శాయీరామ్ ఎందుకమ్ముతున్నట్లు అని ఎవరికయినా అనుమానం వస్తుంది.

"అంచేత మనం అది ఎందుకమ్ముతున్నట్లు అనే వివరం కూడా తెలియజేయాలి!" అన్నాడు రంగారెడ్డి.

'కారు కొంటున్నందువల్ల ఈ మోపెడ్ అమ్ముతున్నాము అని రాస్తే? అని అడిగాను నేను. అందరూ నావంక పిచ్చివాడిని చూసినట్లు చూశారు. అందులో డిఫెక్ట్ ఏమిటో నాకేమాత్రం అర్ధంకాలేదు.

"డాక్టర్ సలహామీద "ఆరోగ్య కారణాలవల్ల అమ్మాల్సి వస్తోంది. అనిరాస్తే?" అని అడిగాడు రంగారెడ్డి.

"అంటే ఈ బండి వాడిన వాళ్ళందరికీ ఆరోగ్యం చెడిపోతుంది అన్న అర్థం వస్తుంది" అన్నాడు గోపాల్రావ్.

"అవునవును" అన్నాడు శాయీరామ్

"ఓ తమామ్ కైకుభాయ్! మై ఏక్ బాత్ బోలూం?" అడిగాడు నిసార్.

"బోలోభాయ్– బోలో!" అన్నాడు యాదగిరి.

"ఓనర్‌కో అండమాన్ ట్రాన్స్‌ఫర్ హెూ గయా కర్‌కే లిఖో–"

అందరూ తప్పట్లు కొట్టారు.

"సూపర్బ్ అయిడియా?" అన్నాడు జనార్ధన్.

అందరం కలసి కూడ బలుక్కుని ఆ వాక్యం కూడా తయారుచేశాము.

"ఓనర్‌కి అండమాన్ ట్రాన్స్‌ఫర్ అయినందువల్ల అమ్మేయడం జరుగుతోంది...." అంటూ తగిలించాం ఆఖర్లో! అదంతా కాలనీ రచయిత చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ తన అద్భుత శైలితో రీరైట్ చేశాడు.

"కానీ మన రాష్ట్ర ప్రభుత్వం వాళ్ళకు అండమాన్ ఎందుకు బదిలీ అవుతుంది?" అని అడిగాడు శాయీరామ్ అనుమానంగా.

"అవన్నీ ఎవడడుగుతాడోయ్– వెధవ అనుమానాలు..." అన్నాడు జనార్ధన్. దాంతో శాయీరామ్ సైలంటయిపోయాడు.

అందరం కలసి తలో అయిదు వేసుకుని పేపర్లో ఆ ప్రకటన ఇవ్వటానికి దబ్బు పోగుజేశాము.

"ఇప్పుడు మనం చెయ్యాల్సిన ముఖ్యమయిన పనేమిటంటే–ఈ మోపెడ్‌ని మెకానిక్ దగ్గరకు తీసుకెళ్ళి కనీసం అయిదారు కిలోమీటర్లు దూరమయినా ఆగకుండా నడిచే విధంగా రిపేర్ చేయించాలి! ఎందుకంటే కొనేవాళ్ళు దీనిమీద ఓ రౌండ్‌కొట్టి పరీక్షిస్తారు కదా?" అన్నాడు రంగారెడ్డి.

వెంటనే నేనూ శాయీరామ్ కలసి దానిని మెకానిక్ దగ్గరకు తీసుకెళ్ళాము.

"చూడు రాములూ! దీనిని కనీసం ఏడెనిమిది కిలోమీటర్ల దూరం వరకూ ఎలాంటి ట్రబుల్ రాకుండా నడిచేటట్లు చేయాలి! ఎలా చేస్తావో నాకు తెలీదుగానీ ఈ సహాయం చెయ్–" అన్నాడు శాయీరామ్.

రాములు కెవ్వున కేకవేశాడు.

"అరేయ్! ఆ చిట్‌ఫండ్ కంపెనీ మనిషి వెళ్తున్నాడు– అర్జంటుగా పిలు...." అంటూ కుర్రాడిని పరిగెత్తించాడు.

"ఏమిటి ఏం జరిగింది?" అడిగాను ఆశ్చర్యంగా. " ఈ బండిని నమ్ముకుని వేనిప్పుడే కొత్త చీటి కట్టాను. ఈ బండి మీద నెలకొచ్చే అయిదొందలూ ఆ చీటికీ కట్టొచ్చని ఆశపడ్డాను.

కానీ ఇప్పుడు మీరు అయిదారు కిలోమీటర్లు నడిచేట్లు చూడమంటే అర్థం అమ్మేస్తున్నారనే కదా- ఇంక నాకు ఆ చీటి కట్టడానికి డబ్బెక్కడనుంచి వస్తుంది?" అన్నాడు దిగులుగా.

చీటి పెద్దమనిషిని తీసుకొచ్చాడు కుర్రాడు.'

"సారీ అన్నా! చీటి కాన్సిల్ చేసెయ్! ఈ బండి అమ్మేస్తున్రు" అన్నాడు రాములు.

అతను గొణుక్కుంటో చిట్ కేన్సిల్ చేసేశాడు.

సాయంత్రం వరకూ తంటాలుపడి పాతికరూపాయలు తీసుకుని బండి తిరిగి ఇచ్చాడు మెకానిక్.

"ఎక్కి ఇంటికి వెల్లిపోదాం! రిపేరయిందిగా?" అన్నాన్నేను శాయిరామ్‌తో.

"వద్దు గురూ! ఎక్కితే మళ్ళీ ట్రబులిస్తుందేమో- కొనేవాళ్ళు టెస్టు చేసుకొనేటప్పుడు వాడితేనే మంచిది" అన్నాడు శాయిరామ్ భయంగా.

మళ్ళీ దానిని కాలనీకి తీసుకెళ్ళాము.

ఆ రాత్రంతా యాదగిరి, శాయిరామ్ కలసి దాన్ని తళతళలాడేలా తుడిచి తెల్లారేసరికల్లా శాయిరామ్ ఇంటిముందు నిలబెట్టారు.

నిజం చెప్పాలంటే దాన్ని చూస్తూంటే అమ్మడానికి మాకే ప్రాణం వప్పలేదు. అంత అందంగా ఉంది.

పేపర్లో మా ప్రకటన రానే వచ్చింది.

"నిజంగా ఈ ప్రకటన ఎంత ఎట్రాక్టివ్‌గా ఉందంటే- నాకే కొన బుద్ధి వేస్తోంది" అన్నాడు రంగారెడ్డి.

ఆ రోజు ఆదివారం కావటం వల్ల ఎవరైనా మా మోపెడ్ కొనుగోలుదార్లు వస్తారేమోనని అందరం కాలనీ ఎంట్రెన్స్ దగ్గరే కూర్చున్నాము.

టైము పన్నెండయింది. ఒంటిగంటా, రెండూ కూడా అయింది. అయినా ఎవరూ రాకపోయేసరికి అందరికీ నిరుత్సాహం పుట్టుకొచ్చింది.

"ఎవరూరారేమో" అన్నాడు శాయిరామ్ దిగులుగా.

అప్పుడే ఆటోరివ్వున వచ్చి మా కాలనీ ముందు ఆగింది. అందులో నుంచి చేతిలో బేగ్ పట్టుకున్న పెద్దమనిషి దిగాడు.

"ఇక్కడ శాయిరామ్ గారిల్లు...."

"ఇడుగో ఇతనేనండి శాయిరామ్. వండర్‌ఫుల్ మోపెడ్-సూపర్ పెర్ఫారమెన్స్- పాపం! అండమాన్ బదిలీ అవబట్టి అమ్మటమేగానీ అది అమ్మడం అస్సలిష్టంలేదు అతనికి!"

"అసలు మా కాలనీలోనే ఎవరొకరు కొనుక్కునేవాళ్ళం! బయటవాళ్ళకమ్మటం

మాకెవరికీ ఇష్టంలేదు. కానీ పాపం అతనికి ట్రాన్స్‌ఫర్ ఖర్చులకు దానికిడబ్బు ఇప్పుడే అవసరం కదా! మా దగ్గర అంత డబ్బు లేదు..” అన్నాడు జనార్ధన్.

“బండి చూద్దామా” అడిగాడతను.

అందరం కలసి పెద్ద ఊరేగింపులా బండి దగ్గరకు నడిచాము.

“ఏమీ ట్రబుల్ లేదుకదా!” అడిగాడతను బండి వంక అనుమానంగా చూస్తూ.

“ట్రబులా? అహహహ-” అని నవ్వాడు రంగారెడ్డి ఇంకేమీ చేయలేక. వెంటనే యాదగిరి అందుకున్నాడు.

“అవ్సార్! ట్రబులెందుకుంటుంది? ఫస్ట్‌క్లాస్ బండిసార్! అసలు ఈ బండీ కొత్తగా మార్కెట్లో రిలీజవగానే 14 మంది మెకానిక్‌లు ఆత్మహత్య చేసుకున్రు! మీకెరికేనా”

ఆ పెద్ద మనిషి ఆశ్చర్యపోయాడు.

“ఆత్మహత్యా? ఎందుకు?” అనడిగాడు నమ్మలేనట్లు

“ఎందుకేమి సార్! దీనికి రిపేర్స్‌గిట్టా ఏమీరావని ఆళ్ళకి తెల్సిపోయింది సార్! రిపేర్‌కి రాకుంటే మరి ఆళ్ళు బ్రతికెడిదెట్లా?”

“అవునవును-” అన్నాడతను కూడా ఆ మెకానిక్‌ల మీద జాలిపడుతూ-.

“పాపం వాళ్ళనీ మోపెడ్ నిజంగా పొట్టమీద కొట్టినట్లే-” అన్నాడు జనార్ధన్.

అతను మరోసారి బండిని పరీక్షగా చూశాడు.

“రేటెంత?” అడిగాడతను.

“ఐదువేలు- వాడింది నెలరోజులే! అయినా రెండువేలు నష్టానికమ్మేయాల్సి వస్తోంది” అన్నాడు గోపాల్రావ్.

“అదీగాక మా వాడిది ‘డబ్బు ముఖ్యం’ కాదు అనే మనస్తత్వం! అందుకే రెండువేలు పోతేపోనీమని వదిలేస్తున్నాడు-” అన్నాడు రంగారెడ్డి.

“ఇదేకాదు. ఇతను ముందొకసారి కూడా వాషింగ్ మిషన్‌కొని నెల్రోజులన్నా అవకముందే ఆరొందలు లాస్‌కి అమ్మేశాడు”అన్నాడు జనార్ధన్.

“నాలుగు వేలు చాలా ఎక్కువ” అన్నాడతను మరోసారి బండి వంకచూస్తూ.

“నో... నో... చాలా తక్కువ” అన్నాడు శాయిరామ్. “అండమాన్ వెళ్ళిపోతున్నారంటే ఇంకా తక్కువ ధరకు దొరుకుందనుకున్నాను-” అన్నాడతను.

“సూపర్బ్ వెహికల్ సార్! ఒక్కలీటర్‌కి 70 కిలోమీటర్లు తక్కువ దూరమా!” అడిగాడు యాదగిరి.

నాకు ఆ మోపెడ్ కంపెనీవాడు దానిని పొగిడినరోజు గుర్తుకొచ్చింది. వాడలా అబద్దాలు

చెప్పినందుకు ఆ తర్వాత మాకు కోపం వచ్చిందిగానీ– వాడిందుకలా పొగిడాడో ఇప్పుడు తెలిసింది! బిజినెస్! అంతే!

ఓ వస్తువు వక్కాడికి అంటగట్టాలంటే అలా పొగడక తప్పదు.

"మూడువేల అయిదొందలకిస్తారా?" అడిగాడతను మళ్ళీ.

అందరం శాయీరామ్ మొఖం వేపు చూశాము. 'సరే' అనేసేట్లు కనిపించాడు నాకు. అడగ్గానే 'సరే' అంటే అవతలి వ్యక్తికి బండిమీద అనుమానం కలుగుతుంది కదా!

అంచేత నేనే కల్పించుకుని "నో! ఒక్కపైసకూడా తగ్గదు" అన్నాను.

అతను శాయీరామ్‌వేపు చూశాడు "అంతేనంటారా?" అన్నాడు వెళ్ళపోడానికి సిద్ధపడుతూ

అందరూ ఖంగారుపడ్డారు.

"అంతే అంటే ఖచ్చితంగా అంతే అని కాదనుకోండి! కొంచెం అటూ ఇటూ...." అన్నాడు శాయీరామ్ చప్పున.

"మరి అతనెవరో ఒక్క పైసకూడా తగ్గదంటాడేం?" నావంక కోపంగా చూస్తూ అన్నాడతను.

"అదా! మరేంలేదు– ఎవ్వర్నీ కొననీకుండా తనే కొనాలని బేరాలు చెడగొడుతున్నాడు లెండి! చెప్పాడు జనార్ధన్.

రంగారెడ్డి సర్దిచెప్పడానికి ప్రయత్నించాడు.

"అబ్బే అతనికేం సబంధంలేదులెండి. అతను మాటలు కేర్ చేయకండి"

"సంబంధం లేకపోతే ఇక్కడెందుకు నిలబడ్డాడు? పంపిం చెయ్యండి–"

"పాపం అతని వస్తువేదో అమ్మినప్పుడు బాగా నష్టపోయాట్ట! అప్పటినుంచీ ఎవరూ నష్టానికి అమ్మగూడదని మాట్లాడుతూంటాడు" ఇంకా సర్దిచెప్పడానికి ప్రయత్నించాడు గోపాల్రావ్.

"సరే– అయితే చెప్పండి! మూడువేల అయిదొందలకిస్తారా?"

శాయీరామ్, రెడ్డీ పక్కకెళ్ళి మాట్లాడుకొచ్చారు.

"మూడువేల ఆరొందలకయితే ఇస్తాను" అన్నాడు శాయీరామ్.

"అక్కర్లే" అంటూ వెనక్కు తిరిగి బయల్దేరాడతను. గోపాల్రావ్ జనార్ధన్‌కి కన్నుగీటాడు. జనార్ధన్‌వొక్కదూకు దూకి అతనికి అడ్డంగా నిలబడ్డాడు.

"అరె! ఫ్రెండ్‌షిప్‌లో అంత కోపమయితే ఎలాగండీ! మావాడు కూడా వందరూపాయల కోసం ఫ్రెండ్‌షిప్ పాడుచేసుకుంటాడా ఏమిటి?" అన్నాడు చిరునవ్వుతో.

"ఫ్రెండ్‌షిప్పా? ఫ్రెండ్‌షిప్పేమిటి? ఇక్కడ నా ఫ్రెండెవరకూ లేరే!" ఆశ్చర్యంగా అన్నాడతను.

"అదేమిటి నన్ను గుర్తుపట్టలేదా మీరు?" అన్నాడు జనార్ధన్ ఇంకేమనాలో తెలీక.

"మిమ్మల్నా? మిమ్మలెక్కడా చూసిన గుర్తు లేదా!"

"భలేవారే! మనం ది గ్రేట్ ఓరియంటల్ సర్కస్‌లో పక్కపక్కనే కూర్చోలేదూ?

"నేనప్పుడూ సర్కస్‌కెళ్ళలేదు" అన్నాడు చిరకుగా.

"హార్నీ! అది కూడా మర్చిపోయారన్నమాట! ఆఫ్‌కోర్స్ మీకు మతిమరుపు ఎక్కువని చెప్పారప్పుడు"

"నాకేం మతిమరుపులేదు- మనం ఎప్పుడూ కలుసుకోలే దసలు."

"సరే పోనీండి! మీకు స్నేహభావం లేకపోయినా మావాడికుంది! అందుకే మీరు నా ఫ్రెండ్ అని నమ్మి ఆ వంద నష్టం కూడా భరించడానికి వప్పుకుంటున్నాడు- మూడువేల అయిదొందల కాష్ ఇచ్చి బండి తీసుకెళ్ళండి" అన్నాడు జనార్ధన్.

"స్నేహం కోసమని ఇంతింత నష్టాలు భరిస్తుంటే నువ్వు దెబ్బతింటావ్ గురూ! ఈసారి పోతేపోనీలేగానీ నీ ఫ్యూచర్ గురించి చెప్తున్నా...." అన్నాడు రంగారెడ్డి నిష్టూరం నటిస్తూ శాయీరామ్‌తో.

"ఏమో గురూ! మొదటినుంచీ స్నేహం అంటే ప్రాణం పెట్టటం అలవాటయిపోయి ఏడ్చింది" అన్నాడు శాయీరామ్ నొచ్చుకుంటూ.

"బండిమీద ఓ రౌండుకొట్టి చూస్తాను" అన్నాడతను.

"ఓ! హాయిగా చెక్ చేసుకోండి! ఎటోచ్చీ ఎక్కువదూరం వెళ్ళవద్దు...." అన్నాడు శాయీరామ్ భయంగా.

"ఇక్కడే మెయిన్‌రోడ్‌వరకూ వెళ్ళివస్తాను" అంటూ బండి స్టార్టు చేసుకుని నెమ్మదిగా నడవసాగాడతను.

అందరం గుండెలు బిగపట్టుకుని చూడసాగాం.

"భలే పడ్డాడ్లే వలలో- ఇంకేం ఢోకాలేదు. శాయీరామ్ అదృష్టవంతుడు!" అన్నాడు జనార్ధన్.

అతగాడు మెయిన్‌రోడ్ మీదకు వెళ్ళి తిరిగి వస్తుంటే గమనించాము- అతని మొఖం ఆనందంతో వెలిగిపోతోంది.

"హమ్మయ్య! ఇంక భయం లేదు! వాడు కొనేసినట్లే....." అన్నాడు రంగారెడ్డి.

సరిగ్గా అప్పుడే అనుకోని ఘోరం జరిగింది. ఒక దుర్మార్గుడు, ఒక నికృష్ఠుడు

శాయిరామ్ సక్సెస్‌ని చూసి ఓర్వలేని వెధవ– తన చెడిపోయిన కొత్త జి.వి.యస్–50 మోపెడ్ రిక్షామీదవేసి రిక్షాని వెనుకనుంచీ తోసుకెళుతూ ఎదురయ్యాడు.

అంతే! అయిదు నిమిషాల్లో అతను మోపెడ్ తీసుకొచ్చి మా మధ్యలో స్టాండ్ వేయటం తన బాగ్ తీసుకుని పరుగెట్టటం జరిగిపోయింది. అక్కడికీ జనార్ధన్, యాదగిరి అతని వెంటపడ్డారు. "కంట్రాక్ట్ అయింది గనుకు బండి తీసుకుతీరాలని" అరుస్తూ. కానీ అతను కార్ల్ లూయిస్ గ్రాండ్‌ఫాదర్ లాగా పరుగెత్తాడు. పరుగెత్తి మెయిన్‌రోడ్‌మీద ఉన్న ఆటోలో కూర్చుని ఏం చెప్పాడో ఏమోగానీ– ఆటోగాల్లో తేలిపోతూ ఎగిరిపోయింది.

అందరం మళ్ళీ దిగులుపడి కూర్చున్నాం.

సాయంత్రం అయిదవుతుండగా ఇంకో ఆటోవచ్చి శాయిరామ్ ఇంటిముందు ఆగటం చూసి అందరం పరుగెత్తాం అక్కడికి.

తీరా చూస్తే ఆటోదిగింది మరెవరో కాదు లక్ష్మయ్య!

"పేపర్ చూశానివాళ! మన మోపెడ్ అమ్ముతామని వేశారు కదా! సరే అమ్మటానికి రెండు మూడు రోజులు పడుతుంది కదా! అంతవరకూ వాడుకోవచ్చని వచ్చాను– అమ్ముతున్నారు గనుక, బండి కండిషన్‌లో ఉండే ఉంటుంది కదూ?" అన్నాడు లక్ష్మయ్య బండి బ్రేకులూ, అవీ చెక్ చేసుకుంటూ.

"మీ దగ్గర ఎవరిదో బండి ఉండాలి కదా?" పాలిపోయిన మొఖంతో అడిగాడు శాయిరామ్.

"నిన్నటివరకూ ఉందిగానీ దాని ఓనర్‌కి ఎంత కొవ్వెక్కిపోయిందటే రోజూవచ్చి నా బండి నాకిమ్మని పేచీ పెట్టటం మొదలుపెట్టాడు. ఒకరోజూ రెండ్రోజులంటే ఊరుకుంటాం– పోనీలే ఓనర్‌దాని వదిలేస్తాంగానీ రోజూ పేచీపెడితే వళ్ళుమండుతుందా, మండదా" అనడిగాడతను.

"అవును మరి! ఎంత ఓనరయితే మాత్రం– అలా చిరాకు పెట్టేస్తుంటే ఎవరికయినా మండిపోతుంది!" అన్నాన్నేను.

"అందుకే వాడిమీద పోలీస్ కంప్లెయింట్ ఇచ్చాను....."

అందరికీ ఆ మాటతో ఆసక్తి కలిగిందా కేస్‌మీద.

"తరువాతేం జరిగింది?" అడిగాడు రంగారెడ్డి. "ఏముందీ పోలీసులు ఓనర్‌ని లాక్కొచ్చి లాకప్‌లో పడేశారు, గానీ తరువాత వాడు చెప్పిన విషయాలన్నీ విని జాలిపడి మా ఇద్దరికీ రాజీ కుదిర్చారు. దాని ప్రకారం ఇవాళ పొద్దున్న బండి ఓనర్ కిచ్చేయమన్నారు. నేను పెద్దమనిషికి కాబట్టి ఇంక బావుండదని ఇచ్చేశాను."

"అవును! అదే ఇంకొకరూ ఇంకొకరూ అయితే అలాంటి పేచీకోరుకీ అసలు బండి రిటర్న్ ఇవ్వరు" అన్నాడు గోపాల్రావ్.

"సరే– ఈ బండి మాత్రం ఎల్లుండి ఇచ్చేస్తాను– ఈలోగా ఇంకెవరయినా కొనడానికి వస్తే నా అడ్రస్ ఇవ్వండి–" అన్నాడు స్టార్టుచేసి బండిమీద కూర్చుంటూ!

అందరం అతనికి అడ్డం పడిపోయాం.

"బాబ్బాబు! ఈ బండి తీసుకెళ్ళకు– నానా అవస్థలూ పడి దీన్ని నడిచేట్లు చేశాం నిన్నే. ఇప్పుడు అమ్మలేకపోతే ఇంక జన్మలో దీనిని అమ్మటం సాధ్యం కాదు" అన్నాడు శాయిరామ్.

"పోనీ రిపేర్ వస్తే ఫిఫ్టీ-ఫిఫ్టీ వేసుకుందాంలే! ఇదే ఇంకొకరయితే అసలు ఒక్క పైసకూడా నేను ఖర్చు చేయను...."

"గురూగారూ! అంత మాటనకండి! అందరం కలిసి ఎలాగోలా నానా తిప్పలూ పడుతున్నాం దీన్ని అమ్మటానికి– దీన్ని వదిలేయండి! మీకు తల్చుకుంటే బళ్ళకేం కొదవ? ఎవరొక ఓనరు దొరక్కపోడు కదా–"

లక్ష్మయ్య చిరాగ్గా బండి దిగాడు.

"మరా సంగతి ముందే చెప్పరేమయ్యా! నా టైమ్ వేస్ట్ చేశారు! బండి ఓనర్ అన్నాక "డీసెన్సీ" నేర్చుకోవాలి బ్రదర్! ఇలా చిరాకు పెడితే రెండోసారి ఇంకెవరిదగ్గరా బండి తీసుకోబుద్ధికాదు నాకు. వస్తా ఆ పక్క కాలనీలో ఇంకొకతను కూడా ఇవాల్టి పేపర్లోనే బండి అమ్ముతున్నట్లు చేశాడు. అతను నాకు బెస్ట్ ఫ్రెండ్‌లే! పైగా ఓసారి నేనతనికి చాలా సహాయం కూడా చేశాను– సిగరెట్ వెలిగించుకోవడానికి లైటర్ అడిగితే ఇచ్చాను! ఇంత స్నేహం ఉన్నప్పుడు "బండి ఇవ్వను" అని అనలేడు కదా... వస్తా...." అంటూ వెళ్ళిపోయాడు.

అందరం "హమ్మయ్య" అంటూ తేలిగ్గా గాలి పీల్చుకున్నాం.

వారంరోజులు గడిచిపోయాయి.

వారం రోజులు గడిచిపోయినా మోపెడ్ కొనడానికి ఎవరూ రాకపోయేసరికి మాకు భయంవేసింది. శాయిరామ్ దిగులు పెట్టుకున్నాడు.

"అదింక అమ్మడం మన వల్లకాదు–" అన్నాడు దిగులుగా.

హఠాత్తుగా ఆ రోజు నిసార్‌గాడు వూడిపడ్డాడు. "ఛలో– జల్దీ ఛలో–" అన్నాడు మా దగ్గరకొచ్చి. "ఎక్కడికి?" అడిగాము మేము.

"ఆజమ్‌భాయ్– వాళ్ళఫ్రెండు మిల్‌కే ఏక్ మోపెడ్ అమ్మింది! కైసా బేచే పూఛ్‌లేంగే...."

అందరం కలిసి ఆటోలో అల్ఫాహోటల్ పక్కనున్న అజమ్‌భాయ్ బుక్ స్టాల్‌ని చేరుకున్నాం. బలవంతంగా ఆజమ్‌భాయ్‌ని ఆల్ఫాలోకి లాక్కెళ్ళి ఛాయ్ తాగించాము.

"ఇప్పుడు చెప్పు గురూ! నువ్వూ మీ ఫ్రెండూ కలసి మోపెడ్ ఒకటి అమ్మారట! ఎలా అమ్మారు?"

"ఎందుకు? శాయీరామ్ కూడా అమ్మేస్తున్నాడా?" అడిగాడతను.

"అవును."

"అది అమ్మటం చాలా కష్టం" అన్నాడు ఆజమ్ గంభీరంగా.

"కానీ నువ్వూ మీ ఫ్రెండ్ నిన్న అమ్మారని నిసార్‌మియా చెప్పాడుగా?"

"చాలా ఫ్లూక్‌బాయ్! అదృష్టం! అంతే!"

"మోపెడ్‌ని బ్రోకరు దగ్గరకు తీసుకెళ్ళాం! అతను అది చూసి ఇనుపకొట్లల్లో అయితే కిలోల్లెక్కకొనే అవకాశాలున్నాయని చెప్పాడు వెంటనే కొట్లకి తీసుకెళ్ళి కిలోలెక్క అమ్మేశాం. మూడొందల పాతిక రూపాయలు వచ్చింది- మా ఫ్రెండ్ చాలా సంతోషించాడు...."

హఠాత్తుగా జనార్ధన్‌కో ఉపాయం తట్టింది. "గుడ్ అయిడియా!" అన్నాడు ఉత్సాహంగా.

"అంటే?" అనుమానంగా అడిగాను

"అవును! మన మోపెడ్ కూడా బ్రోకర్స్‌కి అమ్ముదాం" అన్నాడతను.

"అవ్! బెస్ట్ అయిడియా-"

అప్పటికప్పుడే అందరం కలసి ఆటోలో ఇంటికెళ్ళి మోపెడ్‌ని తీసుకుని ఓ బ్రోకర్ షాపు కెళ్ళాం. అతను మోపెడ్‌ని టెస్ట్‌చేశాడు. ఓ రౌండ్‌కొట్టాడు దానిమీద. తిరిగి వచ్చి "రెండువేలు ఇస్తాను" అన్నాడు.

శాయీరామ్‌కి ఏడుపు ముంచుకొచ్చింది "నెలకిందట అయిదువేలు- ఇప్పుడు రెండువేలకు సమానామా?" అన్నాడు దీనంగా.

అందరం ఇంకో బ్రోకర్‌షాప్‌కి బయల్దేరాం. అతను మా మోపెడ్‌ని చూస్తూనే 'పదిహేను వందలు" అన్నాడు. మాకు మతిపోయినట్లుంది.

"అదేమిటి అవతల షాపతను రెండువేలిస్తానన్నాడుగా?" అడిగాడు రంగారెడ్డి. "వాడు మెంటల్ హాస్పిటల్ పెషేంట్ అయుంటాడు! లేకపోతే! రెండువేలు ఇవ్వటమేమిటి?" అన్నాడతను చిరునవ్వుతో.

మరోషాపుకి వెళ్ళాం పొలోమని.

అతను బండిమీద ఓ రౌండ్ కొట్టివచ్చి. 'నా కొద్దీ బండి!' అన్నాడు తెగేసినట్లు.

"ఎందుకని?" ఆశ్చర్యంగా అడిగాడు జనార్ధన్.

"కిందటిసారి ఈ బండికొంటే దారుణంగా పదివేలు నష్టం వచ్చింది!" అన్నాడతను.

"దీని ఖరీదే అయిదువేలయితే పదివేలు నష్టమెలా వచ్చింది?" కోపంగా అడిగాడు జనార్ధన్!

"అదే నాకిప్పటివరకూ తెలియటం లేదు- ఎలా వచ్చిందో- బహుశా ఒక్కొక్క పార్టు రెండు మూడుసార్లు వేయించి ఉంటాను-"

అక్కడినుంచి మరో రెండుషాపులకు కూడా తిరిగాక మాకు దాన్ని రెండువేలకంటే ఎక్కువకు అమ్మలేమని తెలిసింది.

అంచేత రెండువేలు ఇస్తానన్న బ్రోకర్ దగ్గరకే వెళ్ళాం మళ్ళీ.

"ఏం కావాలి?" అడిగాడతను. "ఇందాక మోపెడ్ చూపించాం కదా- రెండువేలు ఇస్తానన్నారు మీరు..."

"అది ఇందాక సంగతి!" అన్నాడతను తాపీగా.

"అంటే?" ఆశ్చర్యంగా అడిగాడు జనార్ధన్.

"ఇప్పుడు పదిహేను వందలే ఇస్తాను-"

"అదేమిటి? ఇంతలోనే రేటెందుకు మారిపోయింది?"

"అమెరికాలో డాలర్ ధర పడిపోయింది"

"దానికి ఈ మోపెడ్‌కి ఏం సంబంధం?"

"నేను ఫైనాన్స్ అమెరికన్ బ్యాంక్ నుంచి తీసుకుంటా!"

మాకు వాడి మాటలు అర్థం కాలేదు.

"ఇంకో అరగంటాగితే ఇంకా పడిపోతుంది!" అన్నాడతను. ఇంక అతనితో లాభంలేదని మళ్ళీ మోపెడ్‌ని తోసుకుంటూ బయల్దేరాం.

కాస్తదూరం నడిచామో లేదో మా కెదురుగ్గా ఓ కొత్త "ఆటో మొబైల్ బ్రోకర్స్" అనే బోర్డ్ కనిపించింది. అది ప్రారంభించి రెండు మూడు రోజులే అయిందనటానికి నిదర్శంగా పూలదండలు ఇంకా సగమే ఎండి కనిపించాయ్.

"ఇగో- ఈడు కొత్తాడులెక్క ఉన్నాడు భాయ్! మీరేమీ మాట్లాడకండి! నేను సెటిల్‌జేస్తా!" అన్నాడు యాదగిరి.

అందరం యాదగిరి వెంబడి ఆ షాపులోకి నడిచాము.

సర్దార్జీ మమ్మల్ని చూస్తూనే చిరునవ్వుతో ఆహ్వానించాడు.

"క్యా హెూనా?" అన్నాడు హిందీలో.

"ఏ మోపెడ్ బేచ్‌నే అయే....." అన్నాడు యాదగిరి.

"కిత్‌నేమే బేచ్‌ణాహై" అనడిగాడతను బయటకొచ్చి మోపెడ్‌ని పరీక్షిస్తూ.

"త్రీ అండ్ హాఫ్ తౌజెండ్స్" అన్నాడు శాయిరామ్, రెడ్డి ప్రాంప్టింగ్‌వింటూ.

"సాడేతీణ్?" ఆశ్చర్యంగా అన్నాడు సర్దార్జీ.

అని మోపెడ్ స్టార్ట్ చేసుకుని ఓ రౌండ్ కొట్టి వచ్చాడు.

"తీణ్ హజార్ దూంగా!" అన్నాడు మా వంకచూసి. అందరికీ గుండెలు ఆగిపోయినయ్ ఓ క్షణంపాటు! నిజంగా అతనన్నది 'మూడేవేలు' అనేనా అనడిగాడు గోపాల్రావ్ రహస్యంగా.

"అవును" అన్నాడు రెడ్డి.

"సర్దార్జీకేమీ మతిభ్రమించలేదు కదా?" అన్నాడు జనార్ధన్ రహస్యంగా.

"మూడువేల రెండొందల్–" అన్నాడు యాదగిరి.

అందరికీ యాదగిరి మీద ఒళ్ళు మండిపోయింది. రాక రాక వచ్చిన అద్భుతమైన బేరాన్ని అతను చెడగొట్టేస్తున్నాడనిపించింది. అతని వీపుగోకాడు శాయీరామ్ వప్పుకోమన్నట్లు. "ఒక్కపైసా కూడా ఎక్కువ ఇవ్వన్–" అన్నాడు సర్దార్జీ.

"ఠీక్ హై? పైసలు ఇవ్వు–" అన్నాడు యాదగిరి.

సర్దార్జీ ఓ క్షణం ఆలోచించాడు.

"ఇప్పుడు కాదు! రేపు భాయ్ వస్తాడు. అప్పుడు" అన్నాడు అనుమానంగా.

మా గుండెల్లో బోలెడు రాళ్ళుపడ్డాయ్. "అట్లా అంటే కాద్సార్! ఇతనిప్పుడు అర్జంటుగా ఈ బండి అమ్మటానికి కారణమేమిటనుకున్నారు? భార్య సీరియస్సార్! ఆపరేషన్ చేయాలి! డాక్టర్కి రెండువేలు ఫీజు కట్టాలి– ఇంకా మందులకీ మాకులకీ కూడా డబ్బు కావాలి! లేకపోతే ఇంత మంచి బండి, ఇంత కొత్తబండి అమ్ముతారా ఎవరైనా? నో నెవర్ సార్! ఈ రేటుకి ఛస్తే అమ్మరు–"

సర్దార్జీ మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

"ప్లీజ్ సర్దార్జీ ప్లీజ్!" అన్నాడు శాయీరామ్ ఇంకా ఆలోచింపజేస్తే ప్రమాదమని.

"అచ్ఛా ఠీక్ హై!" అంటూ కాగితాల మీద శాయీరామ్ సంతకాలు తీసుకుని రిజిస్ట్రేషన్ పుస్తకం వగైరాలు ఒకసారి చూచుకుని– మూడువేలూ లెక్కపెట్టి ఇచ్చాడు. ఇచ్చిందే ఆలస్యం వణుకుతున్న కాళ్ళతో అందరం రోడ్డు మీద కొచ్చాం.

"గురూ! వాడు ఏ క్షణంలోనయినా మనసు మార్చుకుని– నా డబ్బు నాకిచ్చేయమని వెంబడిపడవచ్చు. అంచేత అందరం విడిపోయి ఎవర్దారిన వాళ్ళు బస్సుల్లో ఇంటికి పోదాం పదండి!" అన్నాడు జనార్ధన్.

వాడి ఆలోచన అద్భుతమనిపించింది మాకు.

మరుక్షణంలో ఎవర్దారిన వాళ్ళు విడిపోయి బస్సుల్లో కాలనీ చేరుకున్నాం. ఆ రాత్రి యాదగిరి అందరినీ పిలిచాడు.

"చూడు గురూ! సర్దార్జీ కొత్తోడు గనుక మనబండి కొన్నాడు. రేపు అయన తమ్ముడు వచ్చిండంటే మన గురించి వచ్చి ఫైసల్ వాపస్ తీసుకోనికి కోషిష్జేస్తాడు. కనుక శాయీరామ్ అన్న గడ్డంగిట్ట తగిలించుకుంటే గుర్తుపట్టలేరు–" అన్నాడు.

"అవును. మనందరం కూడా కొన్నాళ్ళపాటు ఆ సర్దార్జీ షాపుముందు నుంచీ నడవకూడదు–" అన్నాడు రంగారెడ్డి.

అప్పటికప్పుడే కాలనీ కుర్రాళ్ళందరికీ సర్దార్జీలెవరైనా వచ్చి శాయీరామ్ ఇల్లు అడిగితే ఎలా తెలీదని చెప్పాలో ప్రాక్టీస్ చేయించాము.

ఓ రోజు గడిచిపోయింది. శాయీరామ్ మా కాలనీ మేకప్‌మేన్ వేంకటేశ్వర్రావ్ నడిగి ఓ గడ్డం తెచ్చుకుని తగిలించుకున్నాడు. మేమందరం క్రాఫ్ మార్చేసుకున్నాం. అనుకున్నంతా జరగనే జరిగింది.

ఆ రోజు సాయంత్రం ఇద్దరు సర్దార్జీలూ మోటార్ సైకిల్ మీద కాలనీ కొచ్చారు. పిల్లలు ఆడుకుంటున్న చోటకెళ్ళి "శాయీరామ్‌కా ఘర్ కహా హై? అని అడగడం వినిపించింది మాకు. "మాకు తెలీదు!" అని చెప్పేశారు పిల్లలు ముక్తకంఠంతో.

వాళ్ళు నెమ్మదిగా కాలనీ స్టేజీ దగ్గరకొచ్చి సినిమా స్క్రిప్ట్‌రాస్తోన్న చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ దగ్గర కెళ్ళారు.

అతనేదో మాట్లాడి తెలీదని చేతులూపి పంపించివేశాడు. అయినా వాళ్ళు నిరాశ పడకుండా అన్ని ఇళ్ళనంబర్లూ వెతికి శాయీరామ్ ఇల్లు కనుక్కున్నారు. కిటికీలోనుంచి ఆ వ్యవహారమంతా చూస్తోన్న మాకు టెన్షన్ పెరిగిపోతోంది.

పావుగంట తలుపుకొట్టాక శాయీరామ్ గడ్డం తగిలించుకుని బయటికొచ్చాడు. వాడొక్కడే మాట్లాడితే ఖంగారుపడి ప్లానంతా ఎక్కడ పాడుజేస్తాడోనని నేను కూడా కళ్ళజోడు పెట్టుకొని వాడి దగ్గరకెళ్ళాను.

"హమ్‌కో మోపెడ్ బేచాహై శాయీరామ్ నామ్ సే– అడ్రస్‌తో యహీ హై" అంటున్నాడు సర్దార్జీ.

"మోపెడా! ఎవరమ్మారు? శాయీరామా? ఆ పేరుగలాళ్లెవ్వరూ లేరు–" అన్నాడు శాయీరామ్.

"ఏం కావాలిట?" అడిగాను నేను ఏమీ తెలియనట్లు శాయీరామ్‌ని.

"ఎవరో శాయీరామ్ అని మోపెడ్ అమ్మారట వీళ్ళకు–"

"మరి అడ్రస్...." గొణిగాడు సర్దార్జీ.

"నిర్భయ్‌నగర్ కాలనీ పేరుతో రెండు మూడు కాలనీలున్నాయ్– అక్కడెవరయినా ఉన్నారేమో–" అన్నాన్నేను.

"ఎక్కడ?" అడిగాడు సర్దార్జీ ఆత్రుతగా.

"నాకూ తెలీదు! ఒకటి బాంబేహైవేలో ఉన్నట్లు గుర్తు! ఇంకొకటి నిజామాబాద్ రోడ్ మీదెక్కడో ఉండాలి! మరోటి నాగార్జునసాగర్ రోడ్‌మీద...."

సర్దార్జీ ముఖం పాలిపోయింది.

"బహుత్ నుక్‌సాన్ హెూ గయాభయ్ హమారా!" అన్నాడు దీనంగా.

"ఎందుకు ఏం జరిగింది?" అడిగాడు శాయిరామ్.

"ఆ శాయిరామ్ అనే దొంగరాస్కెల్ మాకు మోపెడ్ అంటగట్టి మూడువేలు తీసుకుని పారిపోయాడు. తీరా చూస్తే అది పదిహేనువందల కంటే ఎక్కువ చేయదట! పైగా ఇప్పుడు అసలు దాన్ని కొనేవారే కనపించటం లేదు...."

"అయ్యో పాపం" అన్నాడు శాయిరామ్.

"పాపం మీకు చాలా నష్టం అనుకుంటాను!" అన్నాను నేనూ సానుభూతి ఒలకబోస్తూ.

"నిజంగా నాకు మోపెడ్ అమ్మింది నువ్వు కాదా?" అనుమానంగా అడిగాడు సర్దార్జీ శాయిరామ్ గడ్డం వంక చూస్తూ.

శాయిరామ్ చిరునవ్వు నవ్వాడు.

"అరే భయ్యా! నాకసలు మోపెడ్ అనేదే లేదు. ఇంక అది అమ్మే ప్రసక్తి ఎక్కడిది?" అన్నాడు నా వంకచూస్తూ.

"అవును! మా కాలనీలో అసలెవరికీ మోపెడ్‌లేదు! ఎవరూ ఇంకకొనరు కూడా!" అన్నాన్నేను ఏదోకటి మాట్లాడాలని!

"అచ్చం మీలాగానే ఉన్నాతడనుకూడా! కానీ గడ్డం లేదప్పుడు" అన్నాడు సర్దార్జీ ఇంకా శాయిరామ్ వంకే అనుమానంగా చూస్తూ.

శాయిరామ్ ఈసారి గట్టిగా నవ్వాడు. నేనూ గట్టిగా నవ్వకతప్పలేదు.

"నేను చిన్నప్పటి నుంచీ పెంచుతున్నానీ గడ్డం! కావాలంటే ఇతని నడగండి!" అన్నాడు నా వంక చూపుతూ.

"అవునవును! అయిదో క్లాస్ చదివేటప్పటి నుంచీ గడ్డం ఉంది ఇతనికి!" అన్నాన్నేను.

"అయిదో క్లాసులోనే గడ్డం వచ్చాయ్?" అన్నాడు సర్దార్జీ ఆశ్చర్యంగా.

"అఫ్‌కోర్స్– అఫ్‌కోర్స్– వీడు అయిదోక్లాస్ చదివేటప్పటికే వీడి వయసు పదిహేడు– అన్ని క్లాసులూ రెండేళ్ళు, మూడేళ్ళు చొప్పున చదవాల్సి వచ్చింది" అన్నాను తప్పు కప్పిపుచ్చుకోటానికి.

సర్దార్జీ మొఖం హఠాత్తుగా కోపంగా మారిపోయింది. కళ్ళు ఎర్రబడిపోయినయ్.

"ఆ శాయిరామ్ ఎక్కడకు పోతాయ్ నేను చూస్తా! ఎక్కడయినా కనబడితే ఖతమ్‌చేస్తా" అన్నాడు కత్తిమీద చేయివేస్తూ.

శాయిరామ్ వణికిపోతున్నట్లు తెలుస్తూనే వుంది నాకు.

"అవును! అలాంటి వాళ్ళను మర్డర్ చేయాల్సిందే!" అన్నాన్నేను కూడా సపోర్ట్ చేస్తూ. సర్దార్జీ లిద్దరూ వెళ్ళిపోయారు.

శాయిరామ్, యాదగిరి ఆ తరువాత నెలరోజుల వరకూ ఆఫీస్ కెళ్ళలేదు.

శెలవుపెట్టి ఇంట్లో కూర్చుండిపోయారు.

శాయిరామ్ మనోవ్యథతో మంచం పట్టాడు- మళ్ళీ ఆ సర్దార్జీ ఎక్కడ వచ్చి నా డబ్బు నాకిమ్మంటాడో అని-.

తరువాత ఓరోజు మేమందరం కలసి ఎగ్జిబిషన్‌కెళ్ళి వస్తుంటే ఎవరో ఒకతను శాయిరామ్ మోపెడ్‌ని రిక్షామీద తీసుకెళుతూ చెమటలు తుడుచుకుంటూ కనిపించాడు.

"హమ్మయ్య! ఇంక మనకి భయంలేదు! సర్దార్జీ మోపెడ్‌ని వీడికెవడికో అమ్మేశాడు. ఇంక మనకోసం వెతకడు" అన్నాడు శాయిరామ్ ఆనందంగా.

అందరం స్వేచ్ఛగా ఊపిరిపీల్చుకున్నాం.